# గొల్లపూడి మారుతీరావు

ఇది అందరికీ తెలిసిన తాజ్‌మహల్ గురించి కాదు నేనిప్పుడు చెప్పబోయేది—

ముంతాజ్, షాజహాన్‌ల అమరప్రేమ, ఎర్రటి సాయంకాలపు ఆకాశాన్ని ధిక్కరించే తెల్లటి- స్వచ్ఛమయిన రెండు మనస్సులకు అభిజ్ఞ, అపూర్వ ప్రేమానురాగాలకు అమూల్యమైన ప్రతీక, చరిత్ర చెక్కిలిమీద ఘనీభవించిన అందమైన కన్నీటి చుక్క- యీ తాజ్‌మహల్ గురించి కాదు నేనిప్పుడు చెప్పదలుచుకొన్నది—

ఆగ్రా ప్రయాణాన్నీ, ఓ వర్షాకాలంలోని 24 గంటల అనుభవాన్నీ గుర్తుతెచ్చుకున్నప్పుడల్లా జ్ఞాపకం వచ్చేది ఊదాదరంగు ఆకాశం, పాలరాతి కట్టడపు ఔన్నత్యం, యమునా నది నిండుతనం కాదు—

ఓ చిన్నపూరి గుడిసె, ఎర్రకోట మలుపులో ఓ మురికిపేటకు వంద గజాల దూరంలో దట్టంగా పెరిగిన చెట్లూ, నందాలాల్, వాడి, పొట్టి భార్య, ఓ కుంటి గుర్రం, ఓ పాత గుర్రబగ్గీ- ఇవీ గుర్తుకొస్తాయి.

ప్రపంచ అద్భుతాల్ని నవాబుల కళాభిరుచితో, ధనంతో ముడిపెట్టక మనస్సు విశాలత్వంతో, ప్రేమ ఔన్నత్యంతో కొలిస్తే నేను చూసిన తాజ్‌మహల్ ప్రపంచ అద్భుతాల్లో ఎనిమిదవది అయి తీరుతుంది.


ఇది మరో తాజ్‌మహల్ - దీని గురించే నేనిప్పుడు చెప్పబోతున్నాను.

* * *

ఆ రోజు దురదృష్టం వరించిన లోభి హృదయంలాగ ఆకాశం బ్రద్దలయి ధారాపాతంగా వర్షిస్తోంది. కొత్తగా ఆగ్రాకి రెండు కొత్త టాక్సీలు వచ్చాయని వచ్చినప్పట్నుంచీ నాకు అర్థంకాని భాషలో 'గైడ్' పోరుతున్నాడు. కాని మేము దిగిన హోటల్ మేనేజరుకి నందాలాల్ అంటే సానుభూతిలాగుంది. ముసలిగుర్రం వెనక బండిమీద చలిలో ముడుచుక్కూర్చున్న వాడిని అతనే మొదట పరిచయం చేశాడు. నవ్వితే పళ్ళు ఎత్తు. నన్ను ఆశగా చూస్తూ వంగి వంగి సలాములు చేశాడు. "వీడయితే మీకు కుక్కలాగ సలాములు చేస్తాడు. వీడు ఈ ఊరికి తాజ్‌మహల్ అంత పాతవాడు- తీసుకుపోండి-" అంటూ వచ్చీరాని తెలుగులో చెప్పాడు మేనేజర్. వచ్చినప్పట్నుంచీ వీలయినంత ఘోరమయిన తెలుగులో మాట్లాడుతూ, తాను తెలుగువాడినని నాకు హామీ యివ్వబోతున్నాడు. 'నువు కాకపోయినా యీ హోటల్ మారనులే' అంటే వళ్ళన్నీ కనిపించేలాగ నవ్వుతాడు-

నందాలాల్‌ని చూశాను. మాసిన నీలిరంగు తలపాగా, నల్లదారల కోటు, మోకాళ్ళవరకూ ఎత్తికట్టిన పంచె, పల్చటి మీసాలూ. ఆ రోజు వాడి గుర్రబ్బగ్గీని ఉపయోగించే నా నిర్ణయం మీద జీవితమంతా ఆధారపడినట్టు ఆశతో చూస్తున్నాడు. ఆ పూరంతా వాడికి కొట్టిన పిండిగావును. మంచినీళ్ళప్రాయంగా స్థలాల పేర్లూ, వాటి ప్రాశస్త్యం చెప్తున్నాడు. మాట్లాడుతుంటే చిన్న నత్తి ఉన్నట్టు అనిపించింది. మధ్యమధ్య ఆగుతూ, ఏదో ఆలోచనలతో నిలిచిపోయిన ముఖంపెట్టి, నాలిక సరిచేసుకొని మరోమాట పేరుస్తాడు- రాజకీయ నాయకుడిలాగ. మన దేశంలో మంత్రి కావలసిన అర్హతలున్న మనిషి, యిన్ని వందల మైళ్ళ దూరంలో గుర్రబ్బగ్గీ తోలుకుంటున్నాడని దిగులేసింది!

ఇదంతా మా ఆవిడ గమనిస్తున్నట్టుందిగావును- మెల్లగా నా పక్కకి వచ్చి 'పోన్లెండి, వీడినే బండి కట్టమనండి. నెమ్మదిగా ఊరంతా తిరిగి రావచ్చు' అంది. ఆవిడ మాటలు అర్థం కాకపోయినా, ధోరణి అర్థం చేసుకున్నట్టున్నాడు. ఆమెకి వంగి వంగి సలాములు చేస్తున్నాడు. సేవకులకు వరాలిచ్చిన రాణిలాగ మా ఆవిడ చిరునవ్వు నవ్వుతోంది. 'సరే! రా' అన్నాను. అంతే



విన్నాడు. మరి అక్కడ నిలబడలేదు. ఏదో పేరుపెట్టి పిలుస్తూ ఒక్క అంగలో హోటల్ ద్వారం దాటి పరిగెత్తాడు. కళపెళ లాడే ఎండలో నిర్లక్ష్యంగా నడిచినట్టు వర్షంలోనే నడుస్తూ పోయి గుర్రాన్ని సిద్ధం చేస్తున్నాడు.

ఉత్తరాదివాళ్ళే చేసిన దక్షిణాది యిడ్లీ తిని, మా మేనేజరు మంచితనాన్ని నంచుకొని వసారాలోకి వచ్చి నిలబడేసరికి గుర్రబ్బండి సిద్ధంగా వుంది. ముందు జీవితానికంతా రక్షణ లభించినంత ప్రశాంతంగా, నిర్మలంగా వుంది నందలాల్ మొహం. ఈసారి వాడిపక్కనే ఎవరెవరో వున్నారు. చూశాను. నల్లగా, పొట్టి విగ్రహం కనిపించకుండా ముక్కుకి పెద్ద వెండి ఆభరణం. వర్షంలో కూడా కరిగిపోకుండా నుదుటన పెద్ద బొట్టు. మేం దగ్గరికి రాగానే ముఖమంతా చీర లాక్కొని వయ్యారంగా వొంగి వొంగి సలాములు చేసింది. నవ్వుతూ 'మేరీ బీబీ సాబ్' అని పరిచయం చేశాడు నందాలాల్. బండిచుట్టూ దళసరి కేన్వాసు కప్పాడు. అయినా ఏదో మూలనుంచి అవాంఛితమయిన జ్ఞాపకంలాగ వర్షం లోపలికి తొంగిచూస్తోంది. మధ్యమధ్య ఖాళీల్లోంచి [illegible] అంతరంగంలాగ రొజ్జగాలి కొరుకుతోంది.

వర్షంలో స్నానం చేస్తున్న నందాలాల్‌కి, వాడి భార్యకీ ఆవేశం వచ్చినట్టు లేదు. సాయంకాలానికి మేమిచ్చే డబ్బుతో రోజు గడుస్తుందన్న వేడి ఆలోచన ఆ చలిలో వాళ్ళిద్దరినీ బ్రతికించి వుంటుంది.

ఒకటి రెండు వీధులు దాటగానే ఇరుకు సందుల్లోకి తిప్పింది బండి. విజయోత్సాహపు చిహ్నాల్ని మిగిల్చిన ఒక మహాసామ్రాజ్యపు మహానగరంలో బ్రతుకుతూ జీవితంమీద విజయాన్ని సాధించలేని ప్రజలు వీళ్ళు. ఆగ్రాలో మేం చూసిన మొదటి దృశ్యమే అది! అక్కడి రాజులు రాజ్యాల్ని జయిస్తే వీళ్ళు జీవితంతో పోరాడి ఓడిపోయారు. పేదరికంతో సంఘీభావం పెరుగుతుందిగావును. ఆ చలి ఉదయాన్ని అక్కడా అక్కడా కుంపట్లు చుట్టూ మనుషులు కూర్చొని ఆప్యాయంగా పలకరించుకుంటున్నారు. విచిత్రం! ఎక్కడ చూసినా ముసలివాళ్ళే! [illegible] అధికారం, అజమాయిషీల క్రింద నలిగిపోయి, వంగిపోయిన పాత జ్ఞాపకాల్లాగ వున్నారు. నవ్వితే ఖరీదయిన విస్కీ సీసాలో మిగిలిపోయిన చివరి ఘాటు వాసనలాగ, ఎప్పుడో గొప్పగా బ్రతికిన రోజుల ఛాయలు కనిపిస్తాయి ఆ ముఖాల్లో. వాళ్ళకి ఎటువేపు తాజ్‌మహల్ వుందో గుర్తులేదు. ఎర్రకోటలో [illegible] వున్నాయో, ప్రభుత్వం ఏర్పరచిన పురాతనవస్తు ప్రదర్శనశాల వుందో తెలీదు. యమునానది వేగాన్ని మరిచిపోయి, గమనాన్ని మార్చుకొన్నదేమో అర్థం కాదు. పాత సంస్కృతికి చిహ్నాలుగా, ఆ నగరంలోని శిథిల సమాధుల [illegible] చివరగా మిగిలిపోయిన గుర్తులు వాళ్ళు.

అలాగా రొద్దెలు [illegible]నే ముసలివాళ్ళ బృందం ముందు బగ్గి [illegible] విరగబడి నవ్వాడు నందాలాల్. 'ఇక్కడేముంది సాబ్- ఒకప్పుడు పాదుషాల కాలంలో- ఈ వీధుల్లో రత్నాలు అమ్మేవారట—'

'అప్పుడక్కడ దాల్ కోల్ దుకాణం,' చేతికర్రల షాపు కనిపించాయి! ఈసారి నవ్వడం నావంతయింది.

మళ్ళీ బగ్గి కదిలింది. వర్షం ఈసారి ఎక్కువయింది ఇంటి రేకుల మీదపడి తాగుబోతు పేలాపనలాగ వినిపిస్తోంది. రాజుల తీవ్రతకు తట్టుకొని నిలిచిన ప్రజలు ఈ వర్షం తీవ్రతని లక్ష్యం చేస్తున్నట్టు లేదు.

బండిని ఏదో వంతెన దాటిస్తున్నాడు నందాలాల్- వంతెన క్రింద ఎర్రటి నీటిప్రవాహం ఏమిటని అడిగాను లోపల్నుంచి. 'జమునా' అంది వాడి భార్య. గొంతు నిర్మలంగా, నిండుగా వుంది. మా క్రింద పారుతున్న ఎర్రటినది కూడా అంత నిండుగానూ వుంది. కరుణాపూరితమయిన ఋషి అంతరంగంలాగ ప్రశాంతంగా వుంది. ప్రాపంచిక చింతలను వెక్కిరించే స్థితప్రజ్ఞుని చిరునవ్వులాగ, పైనుంచి కురిసే వర్షాన్ని జీర్ణించుకుంటూ నిలిచిన ఎర్రటి నీరు. ప్రవాహ గమనం అలసిన బాలింతరాలి నడకలాగ వుంది.

'ఇక్కడినుంచి తాజ్‌మహల్ కనిపిస్తోంది సాబ్. చూడండి.' అన్నాడు నందాలాల్.


అటు చూశాను. మసక వేసిన ఆకాశంమీద బద్ధకంగా, కదలలేని మబ్బుతునకలాగ- దూరాన ఓ కట్టడం కనిపించింది. అదే తాజ్‌మహల్ అయి వుంటుందనుకున్నాను.

తరువాత వరసగా చాలా కట్టడాలు చూపించాడు నందాలాల్. 'ఇత్‌మదుద్దౌలా' అనే ఒక్క పేరే యింకా గుర్తుండి పోయింది. వచ్చిపోయే యాత్రికుల ఔదార్యంమీద తమ ఉపాధిని ఏర్పరచుకొన్న పేద మహమ్మదీయుల దిగులు కళ్ళు కూడా యింకా గుర్తున్నాయి. ఆ తర్వాత దయాల్బాగ్ తీసుకువెళ్ళిన గుర్తు.

దట్టమైన చెట్లమధ్య నుంచి, గతుకులరోడ్డు వెంబడే నడిపించి మరో గంటకి ఎర్రకోట దగ్గర ఆపాడు. ఆగ్రా అంటే 'తాజ్‌మహల్' గుర్తు మా ఆవిడకి. ఇవన్నీ చాలా విసుగ్గా వున్నాయి. అరణ్యమంతా పరుగుతీసి, యింక కాలు కదపలేక ఆకలితో, అలసటతో నిలిచిపోయిన ఖడ్గమృగం శరీరంలాగ కనిపించింది ఎర్రకోట- ఆ మసక వెలుగులో మరీ దూరానికి- వర్షం తాకిడికి నలిగిపోయిన కాగితం పడవలాగ కనిపించింది.

లోపల మెట్లెక్కుతూ తనకు తెలిసిన ధోరణిలో వర్ణించడం ప్రారంభించాడు నందాలాల్. వాడిపక్క వినయం, సిగ్గు, చలితో కుంచించుకుపోయిన వాడి భార్య. అంత చలిలోనూ మా కంటె చురుకుగా అడుగులువేస్తూ ముందుకు వురుకుతున్నారు. వాడిని చూస్తుంటే చరిత్ర చేతుల్లో నలిగిపోయిన, మొగలాయి సంస్కృతికీ, జీవితం చేతుల్లో నలిగిపోయిన నందాలాల్‌కీ తేడా లేదని పించింది. గదినుంచి గదికి తిప్పుతూ చివరకి పాదుషా శయనాగారాన్ని చూపించాడు నందాలాల్. రాజవంశాన్ని దీవించే పెద్ద ముత్తయిదువలాగ అక్కడికి యమునానది కిటికీలోంచి కనిపి

# తాజ్‌మహల్



స్తోంది. ఈ గదిలోనే పాదుషాల ముందు చరిత్రకి నాంది జరిగింది. ఇక్కడే పాదుషాల విలాసాలకు బీదప్రజల చరిత్రలు శిథిలమయిపోయాయి. ఈ గదిలో గడిచిన ఒక అమృతక్షణం లోనే ముంతాజ్ ఒక ప్రపంచ అద్భుత నిర్మాణానికి భర్తదగ్గర నుంచి వరాన్ని పుచ్చుకొంది. ఇన్ని శతాబ్దాల తర్వాత ఒక బీద గుర్రబ్బగ్గీవాడూ, ఒక సామాన్య రచయితా తమ ఆలోచనల్ని యిక్కడ పంచుకొనే అదృష్టం లభించింది. మళ్ళీ యీ క్షణం రాదు. అందుకని నందాలాల్ అటు తిరగ్గానే మా ఆవిడని ఒక్కసారి చేతుల్లోకి తీసుకుని ముద్దుపెట్టుకున్నాను. తెల్లబోయి ఆశ్చర్యంగా చూస్తే, 'ముంతాజ్ షాజహాన్ అమరప్రేమకు పునాది యీ గదిలోనే పడింది. ఆ ప్రేమకి మన శ్రద్ధాంజలి యిది- నడువు-' అన్నాను. ఆవిడ ఒకటే నవ్వు.

ఎర్రకోటనుంచి తాజ్‌మహల్ స్పష్టంగా కనిపిస్తోంది. షాజహాన్ వృద్ధాప్యంలో కొడుకు అతణ్ణి బంధించిన గదిలోంచి యింకా విచిత్రంగా కనిపిస్తోంది.

కొడుకు అలా బంధించకపోతే యమునకి అవతలి ఒడ్డున నల్లటి పాలరాతితో మరొక తాజ్‌మహల్ వెలిసేదని నందాలాల్ వివరిస్తున్నాడు. నాకుమాత్రం ఆ ప్రమాదం జరగనందుకు ఎంతో సంతోషం కలిగింది. తండ్రి ప్రయత్నాన్ని మధ్యలోనే ఆపివేసిన కొడుకు అభిరుచిని మనస్సులోనే అభినందించాను. మహాద్భుత నిర్మాణం ప్రక్క అలాంటి నిర్మాణాన్నే చేయబూనడం దానిని అవమానించినట్టే అవుతుంది. అప్పుడే విరిసిన గులాబిపువ్వు ప్రక్క మరొకటి లేనప్పుడే దాని అపూర్వతనం. పునరుక్తినవ్యతను చంపేస్తుంది. మేరిలిన్ మన్రో ప్రక్క అలాంటి మరొక అందకత్తెను నిలిపితే అందానికి అన్యాయం చేసినట్టే- ప్రపంచంలో ఒకే ఒక తాజ్‌మహల్ వుండాలి. దానికి సాటి వేరొకటి వుండ కూడదు- అన్న ఉద్దేశమే ఔరంగజేబు చర్యకు మరొక కారణమై వుంటుంది.

మళ్ళీ గుర్రబ్బగ్గీలో ప్రయాణం సాగించాం. మేం ఎదురు చూస్తున్న క్షణంవేపు గుర్రం పరిగెత్తుతోంది. మా ఆవిడకి ఒకటే ఆత్రుత. అప్పటికి అపరాహ్నం దాటింది.

తాజ్‌మహల్ ప్రాంతంలోకి బండిని తీసుకువచ్చి ఆపాడు. హోరున వర్షం. ఎదురుగా వదిగజాల్లో వున్న వస్తువుకి మాకూ మధ్య బూడిదరంగు తెర జారినట్టు ధారలుగా కురుస్తోంది.

'ఆ మలుపు తిరిగితే తాజ్‌మహల్ కనిపిస్తుంది సాబ్. ముందుకు బండి పోనివ్వరు. అక్కడ గైడ్స్ వుంటారు. చూసి రండి. మేం భోజనంచేసి సిద్ధంగా వుంటాం' అన్నాడు నందాలాల్ వాడి భాషలో.

సరిగ్గా ఆ క్షణంలో అందరూ ఆకలిని మరిచి ముందుకు సాగితే, నందాలాల్‌కి యిప్పుడు ఆకలీ, విశ్రాంతీ గుర్తుకొచ్చాయి. మనకి ప్రపంచంలోకల్లా అద్భుత దృశ్యం వాడికి దైనందిన గమ్యస్థానం. మనకి వినోదయాత్ర-వాడికి జీవనాధారం. తాజ్ మహల్ వాడి జీవితంలో ఒక భాగం. చరిత్ర వాడికి ఉపాధి.


అటువేపు చూసే ఉత్సాహంకూడా చూపలేదు నందాలాల్. నేను బండి దిగగానే రొట్టెలమూట తీసి బండిలో పరుచుకొని వాడూ, భార్యా ఆప్యాయంగా తినడం ప్రారంభించారు.

ఆ క్షణంలో ఆ అద్భుత దృశ్యాన్ని చూడడానికి మేము వర్షంలో ముద్దయిపోయాం. అన్ని దేశాలవారూ, అన్ని రాష్ట్రాల వారూ అక్కడ కనిపిస్తున్నారు. ఒక అపూర్వమయిన అనుభవాన్ని పొందాక ఏర్పడే నిర్లిప్తత, నిశ్శబ్దం - వారి కళ్ళలో ద్యోతకమవుతోంది. అన్ని మతాలూ, అన్ని భావాల సామరస్యం కళాదృష్టిలోనే సాధ్యమవుతుందిగావును. క్రైస్తవునికి, మహమ్మదీయునికీ భూపాల రాగం ఒకే విధంగా వినిపిస్తుంది. పికాసో చిత్రం, టాగూర్ గీతాంజలి ఒకే విధమయిన భావ ప్రేరణను కలిగిస్తుంది.

నా కంటె మా ఆవిడ తొందరగా అడుగులు వేస్తోంది. తిరగవలసిన మలుపు తిరిగాం. మనస్సూ కళ్ళూ ఒక అన్యోన్యమయిన ఆనందానికి సిద్ధపడుతున్నాయి. కాని యిదేమిటి!- వర్షపు ధారల వెనక ఒక జేగురు రంగుకట్టడం కనిపిస్తోంది. పాతజ్ఞానం సాక్ష్యంతో దాన్ని తాజ్‌మహల్‌గా పోల్చుకున్నాను. వెలిసిపోయిన జ్ఞాపకంలాగ, నిర్లక్ష్యానికి గురిఅయిన సంస్కృతీ చిహ్నంలాగ ఒంటరిగా కనిపించింది. ఆ క్షణంలో ఎవరేనా దగ్గరికి వచ్చి 'ఇది తాజ్‌మహల్ కాదు' అని చెవిలో అరిస్తే బాగుణ్ణనిపించింది. 'నల్లనివాడు పద్మనయనంబులవాడు' అని చదువుకొని, మనస్సులో మహోన్నత స్వరూపాన్ని ఊహించుకొన్నాక సినిమాలో లోతు కళ్ళ నీలిరంగు కృష్ణుడిని చూసినట్టు నా ఊహలో తాజ్‌కి, దీనికీ పోలికలేదు!- ఊహ ఎంత మోసం చేస్తుంది! కళకంటె కళా హృదయం ఎంత ఉన్నతమయినది!- సగుణరూపి అయిన కళకి పెరుగుదల లేదు- నిర్గుణాత్మకమయిన కళాహృదయానికి అవధి లేదు. ఊహలోని తాజ్‌మహల్ ఈ వాస్తవికత ముందు కూలి శిధిలమయిపోతోంది. గోడలుకూలి పోతున్నాయి-

మా ఆవిడ మాత్రం నోరు చప్పరిస్తూ 'ఆహా!- ఎంతో బాగుంది' అంటోంది. ఊహకూ వాస్తవికతకూ రాజీ కుదుర్చుకొన్న అదృష్టవంతురాలామె. అక్కడున్న అందరి అదృష్టవంతుల మధ్య నా దురదృష్టాన్ని ప్రకటించుకోవడం యిష్టంలేక, నిశ్శబ్దంగా తాజ్‌మహల్‌ని సందర్శించి వచ్చాను.

నందాలాల్ సుష్టుగా భోజనంచేసి మేం వచ్చేసరికి ఒక




నిద్రకూడా తీశాడు. వాడి భా ్య తాంబూలం వేసుకొంటూ మమ్మల్ని చూసి వాడిని లేపింది. ్రాన్ని ఝళిపిస్తూ 'ఏం సాబ్, ఎలావుంది?' అన్నాడు.

జీవితంలో అన్ని కర్మలన • ముగించుకొని సన్యాసాన్ని స్వీకరించిన యోగి, సంసారసాగ ంలో తనమునకలయిన వాడిని వేసిన ప్రశ్నలాగ వినిపించిందా ప్రశ్న. నేనేం సమాధానం చెప్తేనేం? బాగులేదన్నా చిరునవ్ ; నవ్వి మమ్మల్ని క్షమించేంత నిబ్బరంగా ఉన్నాడు. భోజనం తర్వాత మళ్ళీ నందాలాల్ హుషారు పుంజుకొన్నాడు. ఇంక ఏవేవో స్థలాలు చూపించాడు. కాని నాకుమాత్రం ఆ తర్వాత ఉ ్సాహం చచ్చిపోయింది.

బేరంచేసిన దానికంటె ఎక్కువే యిచ్చాను వాడికి. వాడూవాడికంటె భార్యాసాష్టాంగప ిపోయారు. బీదవాడి సంతోషం ఎంత చవుక? కాని, ఎంత గొప ! కాని, వాళ్ళ కృతజ్ఞతలకి మా ఆవిడకి కళ్ళనీళ్ళే వచ్చాయి. భాషరాదు కాని, లేకపోతే వాడి భార్యకి మంచి నేస్తం అయేది. ఆ తర్వాత ఎన్నో వారాలపాటు నందలాల్‌నీ, వాడి పొట్టి భార్యనీ గుర్తుచేసుకొంటూనే వుంది.

• • •

మళ్ళీ పదేళ్ళకి ఢిల్లీ ప్రయ ణం పడింది. ఆఫీసులో నలు గురిని ఢిల్లీలో ట్రయినింగుకి ప పారు. అప్పుడు మళ్ళీ ఆగ్రా వెళ్ళాలని మిత్రులంతా తీర్మానిం ారు. కాని, ఆ వర్షంలో మనక బారిన కట్టడం; ఎర్రకోట- వీటి జ్ఞాపకాలు, అప్పుడు ఏర్పడిన అభిప్రాయాలూ యింకా చెరిగిపోలేదు. అందుకని ఆగ్రాకి మాత్రం రానన్నాను. కాని మిత్రులుమాత్రం వదల్లేదు. 'నువ్వొకసారి వెళ్ళావుకనక మాకు నువ్వు వద' అన్నారు. ఊహని చెరిపేసు కోవాలన్న తాపత్రయం, వాస్తవాన్ని చూసిన ఆనందంకన్న గొప్పదనుకుంటాను. కాని తాజ్‌మహల్ చూశాక ఊహని ఊహా ప్రపంచంలోనే నిలవనిస్తేనే అపూర్వమయిన ఆనందం ఉన్నదన్న నిశ్చయానికి వచ్చాను. ఈ సూత్ర ప్రకారం చార్లీచాప్లిన్‌తో మాట్లాడడం, గ్రేటాగార్బోను ముద్దుపెట్టుకోవడం, న్యూయార్కు-వీధి బార్‌లలో నీగ్రో సంగీతం వినడం నేను చస్తే చేయను- అవి నాకు అత్యంత ప్రియతమమైనవి కనక.

మొత్తంమీద ఆగ్రా వచ్చాం. అదే మద్రాసీ హోటల్లో దిగాం. అదే మేనేజరు హోటల్లో వున్నాడు. చరిత్ర మారడానికి 10 ఏళ్ళ చిన్న వ్యవధి. కాని జ్ఞాపకం మాయడానికి పదేళ్ళ పెద్ద అవధి. నేను గుర్తుచేశాకకాని పోల్చుకోలేకపోయాడు మేనేజరు. గుర్తు చెయ్యకుండానే పోలిక పట్టగలిగినవాడు ఒక్కడే నందా లాల్. నన్ను చూడగానే హోటల్ ఆవరణలోకి పరుగెత్తుకు వచ్చాడు. మొహం ఇంతయ్యింది. పదేళ్ళు వాడిని చాలా మార్చాయి. జుత్తు నెరిసింది. ఒళు బాగా వచ్చింది. మీసాలు తీసేశాడు. కనుబొమ్మలు దుబ్బుల్లాగ పెరిగాయి. కళ్ళు ఎర్రగా వున్నాయి. తాగుడు ఎక్కువ అలవాటు చేసుకున్నాడుగావును. కాని గొంతులో సౌమ్యత పోలేదు. లేక నామీద గౌరవమేమో అది, 'మేమ్‌సాబ్ రాలేదా సాబ్' అన్నాడు. వాడి మునిలిగుర్రం అక్కడికి కనిపిస్తోంది. మా మిత్రులకి చెప్పాను. —'వీడయితే మనకన్నీ తీరికగా చూపుతాడని.' కాని అప్పటికి టాక్సీలు ప్రబలంగా వున్నాయి. మంచి ఇంగ్లీషు వచ్చిన గైడ్‌ని తీసుకుని కారులో పోదాం అన్నారు. వాళ్ళ సంస్కారానికి నందాలాల్ మురికి బండి, వాడి భాష అడ్డొచ్చాయి. 'వద్దంటున్నారు నందా లాల్' అన్నాను. 'పర్వానై సాబ్. సాయంకాలం తమ దర్శనానికి వస్తాను. ఒక అరగంట నాతో రండి' అన్నాడు. మేం వద్దన్నా మని విచారంలేదు. పదేళ్ళ క్రిందటయితే దిగులు కనిపించేది. ఇప్పుడు నవ్వుతూ వున్నాడు. వయస్సు జీవితంపట్ల పిరికితనాన్ని చంపేసి ఒక వేదాంతాన్ని మిగిల్చింది. ఇప్పుడే నిండుగా వున్నాడు నందాలాల్.

ఈసారి ఎండ వెలుగులో తాజ్‌మహల్ కాస్త మెరుగుగా కనిపించింది. అప్పట్లో కళాసృష్టిని సానుభూతితో అంగీకరించానే కాని ఆప్యాయతతో అనుభవంలో పొదుగుకోలేదు.

సాయంకాలం తిరిగి వచ్చేసరికి నందాలాల్ సిద్ధంగా వున్నాడు. వేడి కాఫీ తాగి వాడి గుర్రబ్బగ్గీలో బయలుదేరాను. ఇప్పుడు వాడి భాష బాగా అర్థమవుతోంది.

ఉన్నట్టుండి అడిగాను : 'నీ భార్య కనిపించదేం?' అంటూ. అంతే! కళ్ళనీరు కార్చడం ప్రారంభించాడు వాడు. ఆ కథంతా చెప్పుకొచ్చాడు. మూడేళ్ళ కిందట పోయిందట. అప్పటి నుంచీ ఒంటరిగానే బండి నడుపుకొంటున్నాడట. జాలేసింది నాకు. ఆ దంపతుల సమిష్టి జీవనం చూసిన నాకు, ఇప్పటి నందాలాల్ ఒంటరి జీవితంలో అసమగ్రత కొట్టవచ్చినట్టు కనిపించింది.

● ఒకడు పోలీస్ స్టే ్షను కెళ్ళి "నిన్న రాత్రి మీ ఇంట్లో పడ్డా దొంగ ిసారి చూడనిస్తారా ?" అని ఇన్‌స్పెక్టరుని అడిగ ు.

"ఎందుకు?" అని ఇన్‌స్పెక్టరు ప్రశ్న.

"ఏంలేదు, మా ఆవి కి మెలుకువ రాకుండా ఇంట్లోకెలా ప్రవేశించాడో అడుగుదామని!"

శిధిలమయిన పాదుషాల గోపలమీదనుంచి కూడా ధైర్యంగా గమనిస్తున్న మొగలాయీ సంస్కృతి చరిత్ర, ఇవాళ సజీవ శైతిల్యాన్ని అనుభవిస్తున్న నందాలాల్ దగ్గరికొచ్చి ఆగిపోయింది. ఆగ్రా ప్రాచీన సంస్కృతీ చైతన్యంలో నందాలాల్ ఒకభాగమయితే, ఇవాళ ఆ చైతన్యం స్తంభించిపోయినట్టే కదా!

'ఎక్కడికి యిలా?' అన్నాను.

'చెప్తాను సాబ్' అంటున్నాడు. అంత దుఃఖంలోనూ వాడిని పలకరించి, వాడి కష్టాలను పరామర్శించిన నా సమక్షం కొంత మనశ్శాంతిని కలిగించడం కనిపెట్టాను. గుర్రబ్బగ్గీ ఎర్రకోట మలుపు తిరిగి, ఓ నలుగుజాలు దాటి దట్టంగా పెరిగిన చెట్లమధ్యకి వచ్చి ఆగింది. సంధ్య వెలుగు అక్కడికి జారడం లేదు. కాలగమనంతో ప్రమేయం లేని ఒక నిశ్శబ్దం ఆ ప్రాంతమంతటా ఆవరించి వుంది. మరో పదిగజాలు నడిపించి ఒకచోట ఆపాడు. చుట్టూ శుభ్రంచేసి మధ్యలో తులసికోటలాంటి కట్టడం వుంది. దానికి ఎర్రరంగు పూశాడు. నిన్నటి పువ్వులు ఎండి గాలికి రెపరెపలాడుతున్నాయి. చుట్టూ బంతిపువ్వుల మొక్కలు పాతి ఉన్నాయి. అతి భక్తితో వినయంతో అక్కడ ముణుకుల మీద కూర్చొని తలవొంచాడు.


'ఇక్కడే సాబ్ నా భార్య పోయింది. మూడేళ్ళయింది. నేనీ గుడిసెలోనే ఉంటున్నాన' అంటూ పక్కనున్న గుడిసె చూపించాడు.

దీనంగా ఆర్ద్రంగా ఆ కట్టడంవేపు చూస్తున్నాడు నందాలాల్. విధి విధించిన శాపాన్ని నిశ్శబ్దంగా స్వీకరించి, ఆ ఒంటరితనాన్ని భార్యపట్ల కృతజ్ఞతతో నింపుకొన్నాడు. అప్పటివాళ్ళ ఆప్యాయత, అన్యోన్యత, పొట్టి భార్య తెల్లటి చిరునవ్వు-ఇద్దరూ కలిసి కష్టాన్ని పంచుకొనే ఒద్దిక- అన్నీ గుర్తుకొచ్చాయి.

ప్రపంచమంతా దీనిని గుర్తించకపోయినా వాడికి అవసరం లేదు. వాడూ, వాడికి నచ్చిన అప్తులూ తెలుసుకుంటే చాలు. వాళ్ళ జ్ఞాపకాలలో ఆమెకు అమరత్వం సిద్ధింపచేశాడు. దూరంగా కనిపించే ఉన్నతమయిన కట్టడంలో భార్యపట్ల ప్రేమానురాగాలతో పాటు, ధనం లభింపచేసిన ఠీవీ, దర్పం ఉన్నాయి. ఇక్కడ నిర్మితమయిన ఈ చిన్న కట్టడంలోనూ అంత ఔన్నత్యమూ వుంది. అంతకుమించిన ప్రేమానురాగాలున్నాయి. కాని వాటితోపాటు పేదరికం యిచ్చిన నిరాడంబరత, విశ్రాంతీ ఉన్నాయి.

అక్కడ విశ్రమించే ప్రేమమూర్తి నలుగురిమధ్యా అమరత్వం గుర్తింపబడే అదృష్టవంతురాలయితే, యిక్కడ విశ్రమించిన నందాలాల్ పొట్టిభార్య,నలుగురి ప్రమేయం లేని ప్రశాంత సుషుప్తి ననుభవిస్తున్న అదృష్టవంతురాలు. భార్యతో సుఖాన్ని, భార్యలేని దుఃఖాన్ని తనకే మిగుల్చుకొన్న అదృష్టవంతుడు నందాలాల్. అల్లంతదూరంలో కనిపించేది ప్రపంచమంతా విస్మయంతో చూసే తాజ్‌మహల్ అయితే, ఇది ఒక గుర్రపుబగ్గీవాడి హృదయాన్ని ఆర్ద్రంచేసే తాజ్‌మహల్.

అప్పటి జ్ఞాపకాలు పునశ్చరణ చేసుకొంటున్నాడుగావును- ఇంకా అటువేపే నిశ్చలంగా చూస్తున్నాడు. తెలియకుండా నాకూ





కళ్ళవెంట నీళ్ళొచ్చాయి.

'ఇక వెళదామా?' అన్నాను.

'నా కోసం ఇంతదూరం వచ్చారు సాబ్. నాకదే పదివేలు.' అని కాళ్ళు పట్టుకున్నాడు.

తిరిగి వస్తూ అనుకున్నాను-

ఈసారి నిజమైన తాజ్‌మహల్‌ని చూచానని- ఈ ఆగ్రా ప్రయాణంలో సార్ధకత ఉన్నదనీ.

Elektro
AIR COOLER
for just Rs. 290/-

Balance in
9 INTEREST-FREE-INSTALMENT
You save Rs.300/- by way of interest.

| MODEL | PRICE | INITIAL PAYMENT | 9 MONTHLY INSTALMENTS |
|---|---|---|---|
| 300 (12") Aluminium | Rs.2275 | Rs.250 | Rs.225 |
| 400 (16") | Rs.2765 | Rs.290 | Rs.275 |
| 450 (18") | Rs.2965 | Rs.310 | Rs.295 |
| 500 (20") Window | Rs.3130 | Rs.340 | Rs.310 |
| 500 (20") Floor | Rs.3445 | Rs.385 | Rs.340 |
| 550 (22") | Rs.4020 | Rs.420 | Rs.400 |
| 400 (16") Fibre glass | Rs.2915 | Rs.305 | Rs.290 |
| 450 (18") Fibre glass | Rs.3115 | Rs.325 | Rs.310 |

HURRY ! Contact with salary certificate.

UNIVERSAL ELECTRONICS
Babu Jagajivan Ram College Road
Lakdikapool, Hyderabad-4 Phones : 226194 – 222728